నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
11 హైదరాబాద్, ఆదివారం 14 జనవరి 2024 SIDDIPET



సంగారెడ్డి, జనవరి 13(నమస్తే తెలంగాణ) : సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఇండ్లకు చేరే తరుణం. ధాన్యలక్ష్మికి స్వాగతం పలుకుతూ అన్నదాతలు మూడు రోజులు ఈ పండుగ నిర్వహించుకుంటారు. రైతుల ఇంట భోగభాగ్యాలు కురిపించే సంక్రాంతి ఈసారి రైతులకు సంబురంగా లేదు. కేసీఆర్ సర్కారులో సంతోషంగా ఉన్న రైతులు.. ప్రభుత్వం, పాలసీలు మారడంతో రైతుల మోముల్లో చిరునవ్వు కనపడడం లేదు. కేసీఆర్ తన పాలనలో వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 'రైతుబంధు' పేరిట పెట్టుబడి సాయం అందించారు. రైతుల పంట రుణాలను మాఫీ చేశారు. రైతుబీమా, ఉచిత కరెంటు సరఫరా పథకాలకు శ్రీకారం చుట్టారు. కేసీఆర్ సర్కార్ సంక్షేమ కార్యక్రమాలతో రైతులు సంతోషంగా ఉన్నారు. తీరా ప్రభుత్వం మారడంతో రైతులు రైతుబంధు, రుణమాఫీ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. కరెంటు కోతలతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వడ్లు అమ్మిన డబ్బులు పూర్తిగా రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకురాబోయే కొత్త పాలసీలు సానుకూలంగా ఉంటాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# రైతన్న రంది..!

## అన్నదాతలకేది సంక్రాంతి సంబురం



- జమకాని రైతుబంధు డబ్బులు
- పంట రుణమాఫీ కోసం ఎదురుచూపులు
- కరెంటు కోతలతో ఇక్కట్లు
- పూర్తిగా అందని ధాన్యం డబ్బులు
- ప్రభుత్వ కొత్త పాలసీలపై ఆందోళన

### జమకాని రైతుబంధు డబ్బు లు..

కేసీఆర్ సర్కార్ రైతుబంధు పథకం ద్వారా సంగారెడ్డి జిల్లాలోని రైతులకు వానకాలం, యాసంగి సీజన్‌లో ఎకరాకు రూ.10వేల చొప్పున రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందజేసింది. 2018లో ప్రారంభమైన రైతుబంధు పథకం ద్వారా 2023 వానకాలం వరకు మొత్తం 11 విడతల్లో 3,28,996 మంది రైతులు ఖాతాల్లో నూ.3675 కోట్లు జమచేసింది. 2023 యాసంగి సీజన్‌కు సంబంధించి 3,62,143 మంది రైతుల ఖాతాల్లో రూ.375.21 కోట్లు జమ చేయాల్సి ఉంది. కాగా, ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరంలోపు భూమి ఉన్న 1,74,726 లక్షల రైతులు ఖాతాల్లో 58.50 కోట్లు మాత్రమే జమచేసింది. ఇంకా 1,87,417 మంది రైతుల ఖాతాల్లో 316.71 కోట్ల రైతుబంధు డబ్బులు జమకావాల్సి ఉంది. రైతుబంధు డబ్బులు జమ కాకపోవడం, యాసంగి పనులకు డబ్బులు లేక రైతులు రందికి గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ద్వారా రైతుల ఖాతాల్లో రూ.15 వేలు జమచేస్తామని, కౌలు రైతులకు రూ.15వేలు, కూలీలకు రూ.12వేలు ఇస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు వాటిపై ఎలాంటి ప్రకటన చేయక పోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

### కరెంటు కోతలతో ఇక్కట్లు..

కేసీఆర్ సర్కార్ వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంటును విజయవంతంగా సరఫరా చేసింది. సంగారెడ్డి జిల్లాలో 1,00,788 బోరుబావులు ఉన్నాయి. వీటికి కేసీఆర్ సర్కార్ అధికారంలో ఉన్నంతకాలం 24గంటల ఉచిత కరెంటు సరఫరా చేసింది. దీంతో జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరి సాగు విస్తీర్ణం పెరిగి దిగుబడి రెట్టింపు అయ్యింది. ప్రభుత్వం మద్దతు ధరతో గ్రామాల్లోనే ధాన్యం కొనడంతో రైతుల ఆదాయం పెరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అనధికారిక కరెంటు కోతలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయానికి 17గంటలు మాత్రమే కరెంటు సరఫరా అవుతున్నదని రైతులు చెబుతున్నారు. కరెంటు కోతల కారణంగా పంటల సాగుపై, దిగుబడిపైనా ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇటీవల వానకాలంలో సేకరించిన ధాన్యం డబ్బులు రైతులకు పూర్తిస్థాయిలో చెల్లించలేదు. దీంతో రైతులు వాటికోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలను రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనిపైనా రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

### రుణమాఫీ కోసం ఎదురుచూపులు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పంట రుణమాఫీ వెంటనే అమలు చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి రెండోనెల నడుస్తున్నది. అయినా పంట రుణమాఫీ అమలు చేయలేదు. సంగారెడ్డి జిల్లాలో 1,91,805 మంది రైతులకు సంబంధించి రూ.1690 కోట్ల పంట రుణమాఫీ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 94,612 మంది రైతులకు సంబంధించిన రూ.55.51 కోట్ల రుణమాఫీ బీఆర్ఎస్ సర్కారు గతంలో చేసింది. ఇంకా 97,193 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

# కైట్ ఫెస్టివల్ అదుర్స్

- ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కోమటి చెరువుపై కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు



సిద్దిపేట కోమటి చెరువుపై పతంగి ఎగుర వేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 13: 'పతంగుల పండుగ అంటేనే ఆనందం..ఆహ్లాదం. పతంగులకు దారం ఆధారం.. పిల్లలకు తల్లిదండ్రులు ఆధారం' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలో బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కోమటి చెరువుపై నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి, ప్రజలతో కలిసి ఆయన పతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి అంటే శీతాకాలం అధికారిక ముగింపు అన్నారు. సిద్దిపేటలో మూడు రోజుల పాటు కైట్ ఫెస్టివల్ జరుగుతుందని, పతంగులను ఎగురవేస్తూ ఆకాశం వైపు చూడటం ద్వారా మనకు 'డి' విటమిన్ లభిస్తుందన్నారు. సంక్రాంతి పండుగ రోజు బెల్లం, నువ్వులతో తయారు చేసిన లడ్డూలు తింటే మన శరీరానికి వేడి లభిస్తుందని మనమంతా నమ్ముతామన్నారు. గతంలో ఎవరికి వారు గాలి పటాలు ఎగురవేసి సంబురాలు చేసుకునేవారిని, ప్రస్తుతం గాలి పటాల టోర్నమెంట్‌లు నిర్వహించే స్థాయికి వచ్చిందన్నారు. యువత పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొని ప్రతి అంశంలోనూ స్ఫూర్తిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, నాయకులు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, బర్ల మల్లికార్జున్, గ్యాదరి రవీందర్, అక్తర్ పటేల్, నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట కోమటి చెరువు వద్ద కైట్ ఫెస్టివల్‌లో జనం సందడి..



కైట్ ఫెస్టివల్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పతంగి ఎగురవేస్తుండగా సెల్ఫీ తీసుకుంటున్న ప్రజలు

# సిద్దిపేట కీర్తి ఎల్లలు దాటింది



అయోధ్యకు వెళ్లే ఆహార పదార్థాల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- అయోధ్యలో అన్నదానం అదృష్టం
- అధ్యయన కేంద్రంగా వికసిస్తుంది
- అన్ని రంగాల్లో సిద్దిపేట ఆదర్శంగా నిలిచింది
- సేవ తత్పరుల నిలయం ఈ ప్రాంతం
- అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితికి శాశ్వత భవనం
- అయోధ్యకు వెళ్లే ఆహార పదార్థాల వాహన పూజలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 13: అయోధ్యలో అన్నదానం చేయడం సిద్దిపేట ప్రాంతానికి దక్కిన గొప్ప అదృష్టమని, సిద్దిపేట సేవా తత్పరతకు నిలయంగా వికసిస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అయోధ్యకు వెళ్లే ఆహార పదార్థాల వాహన పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల వాహనాలను జెండాఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్దిపేట చరిత్ర పుటల్లో ఒక అధ్యయన కేంద్రంగా మారిందన్నారు. దక్షిణ భారతదేశం నుంచి అయోధ్యలో అన్నదానం చేసే భాగ్యం కలగడం గొప్ప వరమన్నారు. అన్ని దానాలకెల్లా అన్నదానం గొప్పదని సిద్దిపేట అమర్‌నాథ సేవా సమితి వారు అమర్‌నాథ్, కేధార్‌నాథ్‌లలో అన్నదానం చేసి మన కీర్తిని ఎల్లలు దాటించారని కొనియాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు మన ప్రాంతం ఆనవాలుగా నిలుస్తుందన్నారు. పట్టాభిరాముడి సన్నిధిలో మన సిద్దిపేట అమర్‌నాథ్ సేవా సమితి అన్నదానం చేయడం మరిచిపోలేని ఘట్టమని చెప్పారు. ఎన్నో వినూత్న కార్యక్రమాలకు ఈ గడ్డ నాంది పలికిందని, అన్నదానానికి కేంద్రంగా విరాజిల్లుంతున్నదన్నారు. మంచుకొండల్లో అన్నం పెట్టి భక్తుల కడుపు నింపుతున్న ఈ ఘనత ఈ ప్రాంతానికే దక్కిందని, ఇలాంటి సేవా కార్యక్రమాలతోనే పట్టాభిరాముడి సన్నిధిలో అన్నదానం చేసే అవకాశం లభించిందన్నారు. దైవభక్తి కన్నా సేవ మరేది లేదని ఆ పరంపరను మనం కొనసాగిస్తూ భవిష్యత్తు తరానికి దిక్సూచీగా నిలుద్దామన్నారు. చాగంటి, గరికపాటి ప్రవచనాలతో సిద్దిపేట ఖ్యాతి మరో మెట్టు ఎక్కిందని, రానున్న రోజుల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ముందుకు వెళ్దామన్నారు. సేవకు మారుపేరుగా నిలుస్తున్న అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితికి సిద్దిపేటలో శాశ్వత భవనం నిర్మించుకుందామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కరాచీ బేకరీ నిర్వాహకుడు ప్రేమ్‌రాజ్, సీనియర్ నాయకులు చిన్న, పాలసాయిరాం, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు ఉప్పల భూపతి, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి వ్యవస్థాపకులు చీకోటి మధుసూదన్, నేతి కైలాసం, గోపిశెట్టి శరభయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సిద్దిపేటలో ఆటో డ్రైవర్ల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 13 : ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని.. నెలకు రూ. 15వేల జీవనభృతి ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని జయశంకర్ స్టేడియంలో సిద్దిపేట ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సిద్దిపేట జిల్లా ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలో 1480 మంది ఆటో డ్రైవర్లు సభ్యులుగా ఉన్నారని, పట్టణానికి వచ్చే అతిథులను గౌరవమర్యాదలతో గమ్యస్థానాలకు చేరుస్తున్నారని ప్రశంసించారు. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని.. రాష్ట్రంలోని 6 లక్షల మంది డ్రైవర్లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు బిజీగా ఉంటూ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదని, వారి ఆరోగ్యం.. మానసికోల్లాసం కోసం ఈ ఆటల పోటీలు ఎంతో దోహద పడతాయన్నారు. సిద్దిపేట స్పోర్ట్స్ హబ్‌గా మారిందని, అన్ని ఆటలు సిద్దిపేటలో నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించడం రాష్ట్రానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా

- గజ్వేల్‌లో కొనసాగుతున్న 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు
- ముగిసిన 110 లీగ్ మ్యాచ్‌లు
- ప్రారంభమైన నాకౌట్ మ్యాచ్‌లు
- రేపు క్వార్టర్,సెమీస్, ఫైనల్స్
- ఫైర్ క్యాంపులో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

గజ్వేల్ అర్బన్, జనవరి 13: గజ్వేల్ పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్న 49వ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో శనివారం లీగ్‌మ్యాచ్‌లు పూర్తయినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, జిల్లా బాలల పరిరక్షణ సమితి సభ్యుడు దేశబోయిని నర్సింలు తదితరులు కరచాలనం చేసి క్రీడాకారుల్లో తమ ప్రసంగాలతో ఉత్సాహాన్ని నింపారు. రాత్రి నిర్వహించిన ఫైర్ క్యాంపులో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాపోటీల్లో మొత్తం 110 లీగ్ మాచ్‌లు పూర్తికాగా, సాయంత్ర నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఆదివారం క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్స్ జరగనున్నాయి. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాజు, జాయింట్ సెక్రటరీలు శ్రీకాంత్, మహేశ్, నరేందర్ టోర్నీ నిర్వహణలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు.



గజ్వేల్‌లో నాకౌట్ మ్యాచ్‌ల్లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

# స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో మెదక్ జిల్లా మున్సిపాలిటీలు వెనుకంజ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 13: స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్-2023 ర్యాంకులను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గురువారం ఢిల్లీలో ప్రకటించింది. కొన్ని నెలల క్రితం జనాభా ప్రాతిపదికన పారిశుధ్య పనుల నిర్వహణపై థర్డ్ పార్టీ ద్వారా సర్వే నిర్వహించారు. వీటికి సంబంధించిన వివరాలు మున్సిపాలిటీల వారీగా ప్రటించారు. మెదక్ మున్సిపాలిటీ జాతీయస్థాయిలో 1021, జోనల్ స్థాయిలో 33, రాష్ట్రస్థాయిలో 71వ స్థానంలో నిలిచింది. తూప్రాన్ మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 1005, జోనల్ స్థాయిలో 21, రాష్ట్రస్థాయిలో 67 స్థానంలో నిలిచింది. నర్సాపూర్ మున్సిపాలిటీ జాతీయస్థాయిలో 928, జోనల్‌స్థాయిలో 17, రాష్ట్రస్థాయిలో 61 స్థానంలో నిలిచింది. రామాయంపేట మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 1682, జోనల్ స్థాయిలో 56, రాష్ట్రస్థాయిలో 116వ స్థానంలో నిలిచింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
OWN BUSINESS OFFER



★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# సొంతింటి కల కలేనా..!

- గృహలక్ష్మి పథకం రద్దుతో లబ్ధిదారుల ఆందోళన
- అప్పులు తెచ్చి ఇంటి పనులు ప్రారంభించామని ఆవేదన
- కాంగ్రెస్ సర్కారు ఆలోచన చేయాలని వేడుకోలు

హుస్నాబాద్ టౌన్, జనవరి 13: నిరుపేదలకు నిలువ నీడను కల్పించేందుకు కేసీఆర్ సర్కారు గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకంలో లబ్ధిదారులుగా ఎంపికైన వారు అప్పట్లో సంతోషానికి గురికాగా, తీరా ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఆ పథకాన్ని రద్దు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం అందించే మూడు లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని సొంతింటి కల సాకారం చేసుకుందాం అనుకున్న లబ్ధిదారులు ఇప్పుడు ఆవేదన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 20 వార్డుల నుంచి 1131 మంది గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి విడతలో 382 మందికి నవంబర్ 8న గృహలక్ష్మి మంజూరు పత్రాలు జారీచేశారు. గృహలక్ష్మి పథకానికి ఎంపికై ప్రొసీడింగ్స్ అందుకున్న వారు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. కొందరు పునాదులు తీయగా, మరికొందరు ఫిల్లర్ల వరకు, ఇంకొందరు ఇంటి దర్వాజాలను సైతం నిలబెట్టుకున్నారు. తీరా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నిలువ నీడకు నోచుకోలేకపోతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అప్పుతెచ్చి ఇల్లు పిల్లర్లదాక కట్టినం..

దసరా ముందట మాకు ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పింర్రు. సాంక్షన్ లెటర్ కూడ ఇచ్చింర్రు. గూనపెంకల ఇల్లు చెదలుపట్టి వానకు ఉరుస్తున్నది. చాన రోజుల నుంచి ఇల్లు కట్టుకోవాలని సూత్తున్నం. ఇద్దరు కొడుకులు ఉన్నరు. ఇబ్బంది అయితుందని రేకులు కూలకొట్టి ఇల్లు పనులు మొదలు పెట్టినం. మహిళా సంఘంలో లచ్చ రూపాయల అప్పుతెచ్చిన. ఆ పైసలతో పని మొదలు పెట్టినం. కైకిలి చేసే బతుకే మేము ఇంత అప్పుతెచ్చి ఇల్లు మొదలు పెడితే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వచ్చిందని ఆ స్కీమ్ రద్దు చేసింర్రని చెబుతుంర్రు. తెచ్చిన అప్పు ఎట్లకట్టుడు. మల్ల మాకు ఎవ్వలు ఇల్లు మంజూరు జెయ్యాలే.

– బొల్లి సరవ్వ, హుస్నాబాద్ (గృహలక్ష్మి లబ్ధిదారు)



హుస్నాబాద్‌లో గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం మొదలు పెట్టిన లబ్ధిదారు బొల్లి సరవ్వ

### దర్వాజ కూడా పెట్టుకున్నం...

హుస్నాబాద్ పట్టణంలోని 2వ వార్డులో ఉంటాం. రోజువారి కూలీ పని చేసి బతుకుతున్నం.మాకు గృహలక్ష్మి కింద ఇల్లు మంజూరు చేశారు. రెండునెలల కిందటనే ఇల్లు పనిమొదలు పెట్టిన.లక్ష రూపాయల దాక అప్పుచేసి బేస్‌మెంట్ లెవల్ పూర్తిచేసి ఇల్లుకు దర్వాజ పెట్టుకున్నా. చేతిలో పైసలు లేక ఇల్లుపని ఆపిన. ఎలచ్చన్లు అయిపోయి నంక పైసలు వస్తయని ఎదురు చూస్తున్న. సర్కారు మారిందని ఇల్లు రద్దు అయిందని తెలిసి ఇప్పుడు చానా బాధకు గురవుతున్నా. అప్పు ఎలా తీర్చాలి. ఇల్లు ఎలా కట్టాలి. కాంగ్రెస్ సర్కారు మాకు అన్యాయం చేయద్దు.

– కొలుకూరి మహేంకాలి, హుస్నాబాద్ (గృహలక్ష్మి లబ్ధిదారు)



హుస్నాబాద్‌లో గృహలక్ష్మి పథకం ఇంటి నిర్మాణం మంజూరు కావడంతో బేస్‌మెంట్ లేపి దర్వాజ పెట్టుకున్న లబ్ధిదారు కొలుకూరి మహేంకాలి